సాక్షి అనకాపల్లి

శనివారం । 28 । డిసెంబర్ । 2024



అమ్మవారికి సారె నివేదన

డాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా విశాక కనకమహాలక్ష్మి అమ్మవారి భక్తులు సారె నివేదించారు.



శ్రీవారికి ప్రత్యేక పూజలు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలను వైభవంగా నిర్వహించారు.

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి శుక్రవారం పేర్కొన్నారు. కనిష్ట ఉష్ణోగ్రతలు ఈనెల 28న 21 డిగ్రీలు, 29న 20.5, 30న 20.6, 31న 20.5, జనవరి 1న 20 డిగ్రీలు నమోదు కావచ్చని తెలిపారు.



పాయకరావుపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న సమన్వయకర్త కంబాల జోగులు, వీసం, చిక్కాల తదితర వైఎస్సార్‌సీపీ నాయకులు



నర్సీపట్నంలో పోరుబాట ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గణేష్, తదితర పార్టీ నాయకులు



యలమంచిలి విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు




వడ్డాదిలో విద్యుత్ చార్జీలు తగ్గించాలని నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ



అనకాపల్లిలో విద్యుత్‌శాఖ కార్యాలయానికి ర్యాలీగా వెళుతున్న సమన్వయకర్త మలసాల తదితరులు

కూటమికి షాక్ ట్రీట్‌మెంట్



మాయ మాటల సర్కారుకు అదే సరైన శాస్తి

- విద్యుత్ చార్జీల పెంపుపై జనాగ్రహం
- 'వైఎస్సార్‌సీపీ పోరుబాట'లో నిరసన వెల్లువ
- ప్రజా వ్యతిరేక ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని హెచ్చరిక
- పెంచిన చార్జీలు తగ్గించాలంటూ ప్లకార్డులతో ఆందోళన
- పాదయాత్రలు, బైక్ ర్యాలీలతో కదం తొక్కిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- అన్ని నియోజకవర్గాల్లో విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేత

ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు తగ్గిస్తామన్నారు.. ఆశలు కల్పించి ఓట్లు వేయించుకున్నారు.. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కాకుండానే చార్జీల మోత మోగించారు.. మాయ మాటలతో మోసగించి ప్రజలకు షాక్ ఇచ్చిన ప్రభుత్వానికి షాక్ ట్రీట్‌మెంట్ ఇవ్వడమే సరైన సమాధానం.. వైఎస్సార్‌సీపీ శుక్రవారం నిర్వహించిన పోరుబాట కార్యక్రమంలో కదం తొక్కిన ప్రజలు, పార్టీ శ్రేణులు ఇదే విషయాన్ని నినదించారు. ప్రజా వ్యతిరేక ప్రభుత్వానికి బుద్ధి చెబుతామన్నారు.

సాక్షి, అనకాపల్లి: కూటమి ప్రభుత్వంలో కరెంట్ చార్జీల పెంపునకు నిరసనగా శుక్రవారం నిర్వహించిన 'వైఎస్సార్‌సీపీ పోరుబాట' జనాగ్రహంతో హోరెత్తిపోయింది. విద్యుత్ బాదుడుతో సతమతమవుతున్న ప్రజలకు మద్దతుగా.. ఈ కూటమి ప్రభుత్వ వైఖరికి నిరసనగా వైఎస్సార్‌సీపీ ఆందోళన నిర్వహించింది. జిల్లా వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలోనూ ఆయా నియోజకవర్గ ఇన్‌చార్జి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ పోరుబాట నిర్వహించింది. ఈ నిరసన కార్యక్రమాల్లో వేలాది మంది వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, విద్యుత్ వినియోగదారులు పాల్గొని విజయవంతం చేశారు. పాదయాత్రలు, బైక్ ర్యాలీలు చేపట్టి భారీ సంఖ్యలో నిరసన తెలిపారు. నియోజకవర్గ కేంద్రాల్లో గల విద్యుత్ కార్యాలయాల వద్ద ప్లకార్డులతో ధర్నా చేపట్టారు. వైఎస్సార్‌సీపీ నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమానికి జిల్లా ప్రజలు, ప్రజా ఉద్యమ సంఘాల వారు మద్దతిచ్చి సంఘీభావం తెలియజేశారు. పోరుబాట కార్యక్రమ విజయం కూటమి ప్రభుత్వంపై పెరుగుతున్న వ్యతిరేకతకు అద్దం పట్టింది

➡ మాడుగులలో మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు ఆధ్వర్యంలో నాలుగు మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు, శ్రేణులు మూడు రోడ్ల కూడలి నుంచి పాదయాత్రగా వెళ్లారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏఈ రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, మాజీ ఎంపీపీ వేమవరపు రామధర్మజ, జెడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం, కిముడి రమణమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ సేనాపతి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

➡ చోడవరం నియోజకవర్గం బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలో మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ పోరుబాట నిర్వహించారు. వడ్డాది జంక్షన్ నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. జెడ్పీటీసీలు దొండ రాంబాబు, శ్రీకాంత్ , పోతల శ్రీను, ఎంపీపీలు గాడి కాసు, పైలా రాజు, దొండ నారాయణ మూర్తి, వైస్ ఎంపీపీ, మండల అధ్యక్షులు కొలిమల్ల అచ్చం నాయుడు, మొక్క మహాలక్ష్మీనాయుడు, దేవరపల్లి సత్య, ఏడువాక సత్యారావు, నెప్రూా కోవెల జనార్దన్, జోగా కొండబాబు, పుల్లేటి వెంకటేష్ సత్యదేవ, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.

➡ అనకాపల్లి టౌన్‌లో సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ ఆధ్వర్యంలో రింగురోడ్డులో గల పార్టీ కార్యాలయం నుంచి వందలాది మంది బైక్ ర్యాలీ నిర్వహించారు. సుమారు 4 కిలోమీటర్ల మేర సాగిన ప్రదర్శన ఎస్ఈ కార్యాలయానికి చేరుకొంది. నిరసన ప్రదర్శన అనంతరం వినతిపత్రం అందజేశారు. ఏపీఐడబ్ల్యూఏ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, ముఖ్య నేతలు మందపాటి జానకీరామరాజు, గొర్లి సూరిబాబు, పెతకంశెట్టి జోసెఫ్, మండల అధ్యక్షులు పెదిశెట్టి గోవింద్, మలసాల కిశోర్, మళ్ల బుల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

➡ నర్సీపట్నంలో మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ ఆధ్వర్యంలో పెదబొడ్డేపల్లిలో గల పార్టీ క్యాంప్ కార్యాలయం నుంచి ఈఈ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి నిరసన తెలియజేశారు. ముఖ్య నేతలు చింతకాయల సన్యాసిపాత్రుడు, రుత్తల యర్రపాత్రుడు, డాక్టర్ లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

➡ యలమంచిలిలో మాజీ ఎమ్మెల్యే యూవీ రమణమూర్తి రాజు ఆధ్వర్యంలో గాంధీనగర్‌లో గల పార్టీ కార్యాలయం నుంచి ఏడీఈ కార్యాలయం వరకు బైక్ ర్యాలీగా వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర, పార్టీ మండల అధ్యక్షులు కొల్లి త్రినాథ్, కిశోర్‌రాజా, దేశంశెట్టి శంకరావు, ఆడారి అచ్చియ్యనాయడు, ముఖ్యనేత గొట్టిముక్కల శ్రీనుబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్లు అర్రెపు సత్య గుప్త, బెజవాడ నాగేశ్వరరావు, జెడ్పీటీసీలు లాళం రాము, పెంటకోట సోము సత్యనారాయణ పాల్గొన్నారు.



మాడుగుల ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముత్యాల నాయుడు

పేదోడికి అండగా వైఎస్సార్‌సీపీ

- ఆరు నెలలు తిరగక ముందే కూటమి సర్కారు విద్యుత్ చార్జీల బాదుడు
- జగనన్న కాలనీ ఇళ్ల కరెంట్ మీటర్లపై రూ.3 వేలు వంతున వసూలు
- సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలు చేయాల్సిందే
- లేకుంటే దశలవారీ ఆందోళన
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి

సాక్షి, అనకాపల్లి: ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పేరిట హామీలు గుప్పించి, విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన మాంత్రికుడు చంద్రబాబు.. ఆరు నెలలు తిరగకముందే ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపాడని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు మండిపడ్డారు. కూటమి ప్రభుత్వానికి పేదోడంటే చులకన.. అందుకే జగనన్న కాలనీలో ఇళ్లకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉచిత కరెంట్ మీటర్లు ఇస్తే.. వారి నుంచి ఇప్పుడు ఒక్కో మీటర్‌కు రూ.3 వేలు చొప్పున వసూలు చేస్తున్నారని ఆరోపించారు. శుక్రవారం మాడుగుల పట్టణంలో 'వైఎస్సార్‌సీపీ పోరుబాట'లో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. విద్యుత్ చార్జీల పెంపుతో గృహ వినియోగదారుల కరెంటు బిల్లు నవంబర్ కన్నా డిసెంబర్‌లో చాలా ఎక్కువగా వచ్చిందన్నారు. ట్రూఅప్ చార్జీలు, సర్దుబాటు చార్జీల పేరిట పేదల ముక్కుపిండి మరీ వసూళ్లు చేస్తున్నారని మండిపడ్డారు. 200 యూనిట్ల లోపు కరెంటు వినియోగించే ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు రాయితీ తొలగించి, మొత్తం బిల్లులు చెల్లించాలంటూ తీవ్ర ఒత్తిడి తీసుకొస్తున్నారని ఆక్షేపించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేవరకు వైఎస్సార్‌సీపీ ఉద్యమాలు చేస్తూనే ఉంటుందన్నారు. నాణ్యమైన విద్యుత్ లేదు.. విద్య లేదు.. వైద్యం లేదని.. తమ ప్రభుత్వ హయాంలో ఈ సమయానికే రైతు భరోసా, అమ్మ ఒడి, ఆసరా, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలను అమలు చేసి విద్య, వైద్యం, విద్యుత్ శాఖల ద్వారా పేదలను ఆదుకున్నామని గుర్తుచేశారు. పేద ప్రజలే కదా.. వారికి ఇచ్చిన హామీలు అమలుచేయకపోయినా పరవాలేదనుకుంటే కుదరదు.. వైఎస్సార్‌సీపీ ఆ పేదోడికి అండగా నిలుస్తుందని.. చంద్రబాబు అండ్ కో గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు.

➡ మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు ఆధ్వర్యంలో పాయకరావుపేట వై జంక్షన్ నుంచి పాదయాత్రగా బయలుదేరి విద్యుత్ కార్యాలయం చేరుకొని నిరసన తెలియజేశారు. వ్యవసాయ సలహామండలి మాజీ చైర్మన్ చిక్కాల రామారావు, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, సీనియర్ నేత బొలిశెట్టి గోవింద్, దత్తుడు సీతబాబు, శ్రీరం నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మాట తప్పిన చంద్రబాబు



అధికారంలోకి వస్తే ఐదేళ్లలో కరెంట్ చార్జీలు పెంచనని, ఉన్న చార్జీలను తగ్గిస్తానని ఎన్నికల ముందు చెప్పిన చంద్రబాబునాయుడు మాట తప్పారు. ఆరు నెలల్లోనే విద్యుత్ చార్జీలు పెంచి మాట మీద నిలబడని ముఖ్యమంత్రిగా మరొకసారి నిరూపించారు. గతంలో కూడా రైతు, డ్వాక్రా రుణ మాఫీ, ఇంటికొక ఉద్యోగం, యువకులకు నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పి మోసగించారు.

– **కంచర్ల మహాలక్ష్మినాయుడు**, వడ్డాది, బుచ్చెయ్యపేట మండలం

ఎస్సీలకు అన్యాయం



ఈదటం గ్రామానికి చెందిన మేకా సోమయ్యకు గత 5 సంవత్సరాలుగా విద్యుత్ బిల్లు రాలేదు. గత ప్రభుత్వం ఎస్సీలకు ఇచ్చిన రాయితీ ప్రకారం బిల్లు పడలేదు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 10 వేల రూపాయలు కట్టమని బిల్లు వచ్చింది. ఎన్నికల ముందు కరెంట్ బిల్లులు పెంచమన్నారు. కానీ అంచెలంచెలుగా పెంచుతున్నారు.

– **కోడ కోటేశ్వరరావు**, పాల్మన్‌పేట సర్పంచ్, పాయకరావుపేట

కరెంటు బిల్లు రెట్టింపు



విద్యుత్ చార్జీలు పెంచడం వలన సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మాకు గతంలో రూ.500 నుంచి 600 వరకు విద్యుత్ బిల్లు వచ్చేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.1000 నుంచి రూ.1200 వరకు వస్తోంది. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చారు. ఇప్పుడు మాట తప్పారు.

– **కాళ్ల రాము**, కేజేపురం, మాడుగుల మండలం

కూటమి పాలనలో ఖర్చులు పెరిగాయి



ప్రభుత్వాలు, విద్యుత్ సంస్థల అనాలోచిత విధానాలతో విద్యుత్‌ను కొనుగోలు చేసి భారాన్ని ప్రజలపై మోపడం సరైన నిర్ణయం కాదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి సగటు మనిషి కుటుంబ ఖర్చులు విపరీతంగా పెరుగుతూ వస్తున్నాయి. ఇప్పుడు విద్యుత్ చార్జీలను కూడా పెంచితే ప్రజలు జీవన స్థితిగతులపై తప్పకుండా ప్రభావం చూపుతాయి.

– **పెంటకోట శ్రీనివాసరావు**, వినియోగదారుడు, అనకాపల్లి

ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగ నోటిఫికేషన్ల విడుదల

తుమ్మపాల: ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేసినట్లు కలెక్టర్ విజయ కృష్ణన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ, తెలంగాణ యువతకు అగ్నివీర్ వాయు, మెడికల్ అసిస్టెంట్, ఫార్మసిస్ట్ ట్రేడ్‌లలో ఎయిర్‌మెన్ ఉద్యోగాలకు రిక్రూట్‌మెంటు అధికారి, కమాండింగ్ అధికారి గురుప్రీత్ అట్వాల్ ఉద్యోగ నోటిఫికేషన్లను విడుదల చేసినట్లు తెలిపారు. అగ్నివీర్ వాయు ఇంటెక్ 01/2026 కోసం ప్రవేశం నోటిఫికేషన్ వివరాలు agnipathvayu.cdac.inలో అందుబాటులో ఉన్నాయని, మెడికల్ అసిస్టెంట్, ఫార్మసిస్ట్ ట్రేడ్‌లలో ఎయిర్‌మెన్ ఉద్యోగాలు ఓపెన్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ద్వారా ఎంపిక చేస్తారన్నారు. నోటిఫికేషన్ వివరాలు airmenselection.cdac.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్‌లో వివరాలు చూడవచ్చని సూచించారు. జిల్లా నుంచి అధిక సంఖ్యలో యువత రిక్రూట్‌మెంట్ ర్యాలీలో పాల్గొనాలని ఆమె ఆకాంక్షించారు.

ముఠా కార్మికులు, వర్తకుల చర్చలు విఫలం

తుమ్మపాల: పట్టణంలో ముఠా కార్మికులు, వర్తక సంఘం ప్రతినిధుల మధ్య లేబర్ ఆఫీసులో శుక్రవారం జరిగిన చర్చలు విఫలమయ్యాయి. తొలుత కూలి రేట్లు 50 శాతం పెంచాలని డిమాండ్ చేసిన కార్మికులు 35 శాతం వరకు దిగి వచ్చారు. వర్తక సంఘం ప్రతినిధులు కేవలం 14 శాతం మాత్రమే పెంచుతామనడంతో ఇరు వర్గాలకు ఏకాభిప్రాయం కుదరలేదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు తెలిపారు. దీంతో లేబర్ అధికారులు చర్చలను శనివారం సాయంత్రం 4 గంటలకు వాయిదా వేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

దాబాలో గోమాంసం విక్రయాలు

- పట్టుకున్న సినీ నటి కరాటే కల్యాణి
- పోలీసులకు అప్పగింత



ఒడ్డిమెట్ట సమీపంలో దాబా వద్ద గో మాంసాన్ని పట్టుకుని పోలీసులకు అప్పగించిన కల్యాణి

నక్కపల్లి: ఒడ్డిమెట్ట సమీపంలో పెట్రోలు బంకు పక్కన ఉన్న దాబాలో గోమాంసం వండి విక్రయిస్తున్నట్లు బీజేపీ ధార్మిక విభాగం రాష్ట్ర ప్రతినిధి, సినీ నటి కరాటే కల్యాణి ఆరోపించారు. శుక్రవారం ఈ దాబాలో సుమారు 5 కిలోల గోమాంసం కూరగా తయారు చేసి విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఇక్కడకు వచ్చినట్లు తెలిపారు. పరిశీలించగా గోమాంసాన్ని చపాతీలతోపాటు విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. దాబా నిర్వాహకులను నిలదీయగా ఇక్కడ లభించిన మాంసం గోవులదేనని అంగీకరించడంతో ఆమె వెంటనే నక్కపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ సన్నిబాబు తమ సిబ్బందితో వచ్చి జరిగిన సంఘటనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కరాటే కల్యాణి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో తమ ధార్మిక పరిషత్‌కు చెందిన వారు ఉన్నారని, వారి బంధువులు దాబా వద్దకు టిఫిన్ కోసం రాగా ఇక్కడ నిర్వాహకులు గోమాంసాన్ని వండి పుల్కా, చపాతీలకు కూరగా విక్రయిస్తున్నట్లు గుర్తించారన్నారు. తమకు సమాచారం ఇవ్వడంతో తాము హైదరాబాద్ వెళ్తూ మార్గంమధ్యలో దాబా వద్దకు వచ్చి నిర్వాహకులను నిలదీసినట్లు పేర్కొన్నారు. పట్టుబడిన దాబాలోనే కాకుండా విశాఖ నుంచి అన్నవరం వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న పలు దాబాల్లో గోమాంసాన్ని వండి పుల్కాలు, చపాతీలతో అమ్ముతున్నట్లు దాబా నిర్వాహకులు చెబుతున్నారన్నారు. పోలీసులు జాతీయరహదారి వెంబడి ఉన్న దాబాల్లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల సహాయంతో తనిఖీలు నిర్వహించాలని కోరారు. గో అక్రమ రవాణాను, పశుమాంసం విక్రయాలను వదిలే ప్రసక్తి లేదన్నారు. ఈ వ్యవహారంపై జిల్లా ఎస్పీకి కూడా ఫిర్యాదు చేయనున్నట్లు కల్యాణి తెలిపారు.

ఈ ఘటనపై ఎస్ఐ సన్నిబాబు మాట్లాడుతూ పట్టుబడ్డ మాంసాన్ని సీజ్ చేసి, ఫుడ్ సేఫ్టీ అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. శనివారం వారు వచ్చి పరీక్షలు నిర్వహించి గోమాంసమని నిర్ధారిస్తే తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. దాబా నిర్వాహకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పేర్కొన్నారు. గోమాంసాన్ని పట్టుకున్న కల్యాణి వెంట స్థానిక ధార్మిక పరిషత్ సిబ్బంది రామాల శ్రీను, కానుకోల్లు భాస్కర్‌రావు, కొమ్మన సాంబమూర్తి, పక్కుర్తి లోవకుమార్ తదితరులు ఉన్నారు.

టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 9 వినతులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 9 వినతులు వచ్చాయని చీఫ్ సిటీ ప్లానర్ పి.ప్రభాకరరావు తెలిపారు. వీటిలో జోన్-2 నుంచి 2, జోన్-3 నుంచి ఒకటి, జోన్-6 నుంచి 3, జోన్-7 నుంచి 2, జోన్-8 నుంచి ఒక వినతి వచ్చినట్లు చెప్పారు. వచ్చిన దరఖాస్తులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని పట్టణ ప్రణాళికా విభాగ అధికారులను ఆదేశించారు.

అమ్మకు లక్ష పుష్పార్చన

కనకమహాలక్ష్మికి సామూహిక కుంకుమ పూజలు



పూజల్లో పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళలు

యలమంచిలి రూరల్: ధర్మవరంలో వున్న కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం మార్గశిర మాసం ప్రత్యేక పూజలతో కళకళలాడుతోంది. ఈ నెలలో గురు, శుక్రవారాల్లో భక్తుల రాకతో ఆలయం కిటకిటలాడుతోంది. శుక్రవారం మహిళా భక్తులతో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం అమ్మవారికి లక్ష పుష్పార్చన కనుల పండువగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు వెలవెలపల్లి కోటేశ్వర కుమారశర్మ ఆధ్వర్యంలో సహస్రనామ పఠనాలతో, వివిధ రకాల పూలతో లక్ష పుష్పార్చన పూజలు చేశారు. సుమారు రెండు వేలమంది మహిళలు ఈ పూజల్లో పాల్గొనడంతో ఆలయ ప్రాంగణం, పరిసరాలు కిటకిటలాడాయి. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు ఎంతగానో పరవశించిపోయారు. పూజల అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కొఠారు సాంబ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేపట్టారు.



అమ్మవారికి పుష్పార్చన

ఎస్సీ కులగణనపై 31 వరకు అభ్యంతరాల స్వీకరణ

తుమ్మపాల: ఎస్సీ కులగణన జాబితాపై ఈ నెల 31వ తేదీ వరకు అధికారులు అభ్యంతరాలు స్వీకరిస్తారని జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి కె.రాజేశ్వరి తెలిపారు. ఎస్సీ కులగణన వివరాలను ఈ నెల 26న గ్రామ వార్డు సచివాలయాల్లో ప్రదర్శించినట్లు తెలిపారు. జనవరి 6వ తేదీ వరకు అభ్యంతరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తారన్నారు. సమగ్ర వివరాల సేకరణ అనంతరం అదే నెల 10న కులగణన తుది వివరాలను గ్రామ వార్డు సచివాలయాల్లో ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు.

మూడు దశలలో తనిఖీ

పేరు, ఆధార్ నంబర్, పుట్టిన తేదీ, వయస్సు, ఉప కులం, మరుగుదొడ్డి సౌకర్యం, తాగునీటి సౌకర్యం, విద్యార్హత, వృత్తి, వ్యవసాయం ఇతర వివరాలను గ్రామ/వార్డు సచివాలయాల్లో ప్రదర్శిస్తారు. ఈ డేటాపై అభ్యంతారాలను వీఆర్వో స్వీకరిస్తారు.

వీటిని మూడు దశలలో తనిఖీ చేస్తారు. 1. పౌరుల నుంచి వచ్చిన అభ్యంతరాలను వీఆర్వో పరిశీలించి వివరాలను ఆర్ఐకి నివేదిస్తారు. 2. వీటిని ఆర్ఐ పునఃపరిశీలించి తహసీల్దార్‌కు రికమండ్ చేస్తారు. తర్వాత తహసీల్దార్ వీఆర్వో ఆర్ఐల నివేదికలో వివరాలను పరిశీలించి, తుది ఆమోదం తెలిపి ఆ వివరాల్ని పోర్టల్‌లో పొందుపరుస్తారు. 3.పొందు పరిచిన వివరాల్లో కచ్చితత్వాన్ని పెంపొందించేందుకు సహాయ సాంఘిక సంక్షేమ అధికారులతో 50 మంది వివరాల్ని ర్యాండమ్‌గా తనిఖీ చేయిస్తారు.

క్లుప్తంగా

డీలర్ పోస్టులకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఆర్డీవో రమణ, కమిటీ సభ్యులు

నర్సీపట్నం: రెవెన్యూ డివిజన్ పరిధిలో డీలర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఆర్డీవో వి.వి.రమణ ప్రకటించారు. 25 షాపులకు రాత పరీక్షలో 67 మంది ఎంపికయ్యారు. వీరికి శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలను ఆర్డీవో రమణ, మండల ప్రత్యేక అధికారి మైనింగ్ ఏడీ శివాజీ, సీడీపీవో మేరీ సువార్త, నర్సీపట్నం తహసీల్దార్ రామారావు నిర్వహించారు. ఇంటర్వ్యూకు 63 మంది హాజరయ్యారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఆర్డీవో కార్యాలయ నోటీసు బోర్డులో ప్రదర్శించారు.

రేపు పీఆర్టీయూ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న గోపీనాథ్, యూనియన్ ప్రతినిధులు

నర్సీపట్నం: ఈ నెల 29న పీఆర్టీయూ ఆధ్వర్యంలో నర్సీపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్ (మెయిన్) నందు మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్ తెలిపారు. వైద్య శిబిరం కరపత్రాలను యూనియన్ సభ్యులతో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. కేర్ హాస్పిటల్స్ నుంచి జనరల్ వైద్యులు డాక్టర్ ఎ.పృథ్వీరాజు, డాక్టర్ రఘు యలవర్తి, కంటి వైద్యానికి సంబంధించిన వైద్యులు హాజరవుతున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు అల్లు అప్పారావు, అడిగర్ల వరహాలనాయుడు, జి.వి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా మేళా.. అదిరే..

- వసంద్రైన ఉత్పత్తులతో అదరగొడుతున్న మహిళా సంఘాలు



సందర్శకులతో కిటకిటలాడుతున్న స్టాల్స్

ఎంవీపీకాలనీ: సంక్రాంతి సమీపిస్తున్న వేళ ఎక్కడ చూసినా షాపింగ్‌ల సందడే. ఆ పండగ వాతావరణాన్ని మరింత ఇనుమడింపజేస్తూ జీవీఎంసీ, మెప్మా ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా మైదానంలో ఏర్పాటు చేసిన డ్వాక్రా మేళాకు విశేష స్పందన లభిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో 100 స్టాల్స్ ద్వారా అందుబాటులోకి తెచ్చిన ఉత్పత్తులకు వినియోగదారుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఈ నెల 29వ వరకు ఈ మేళా ద్వారా విక్రయాలు జరగనున్నాయి.

బంగారాన్ని మరపించేలా..



బంగారాన్ని మరపించే విధంగా సింహాచలానికి చెందిన సాయిగణేష్ జ్యూయలరీ పేరిట మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్‌లో పచ్చల రాళ్లు పొదిగిన ఉంగరాలు, పచ్చల హారాలు, కడియాలు, బ్రాస్లెట్స్, చెవి కమ్మలు అందుబాటులో ఉంచారు. పంచలోహాల్లో వినియోగించే మెటల్స్‌తో వీటిని తయారు చేయడంతో వీటి రంగు మారే అవకాశం లేదని నిర్వాహకులు వెల్లడించారు. రూ.200 నుంచి రూ.1000 ధరలో వీటిని విక్రయిస్తున్నారు. గోల్డ్ కోటెడ్ సిల్వర్ ఉత్పత్తులు, మ్యారేజ్ సెట్స్, సిల్వర్‌పై గోల్డ్ కోటింగ్‌తో తయారు చేసిన రుద్రాక్షమాలలతో పాటు రూ.100 నుంచి రూ.20,000 వరకు విలువచేసే ఉత్పత్తులు విక్రయానికి ఉంచారు.

స్పందన బాగుంది

- కేంద్ర అర్బన్ అఫైర్స్ జాయింట్ సెక్రటరీ రాహుల్ కపూర్



స్టాల్‌ను సందర్శిస్తున్న రాహుల్ కపూర్

డ్వాక్రా ఉత్పత్తుల మేళాకు విశాఖ ప్రజల స్పందన చాలా బాగుందని మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ జాయింట్ సెక్రటరీ రాహుల్ కపూర్ అన్నారు. ఏపీ మెప్మా ఎండీ ఎన్.తేజ్ భరత్‌తో కలసి ఆయన మేళాను సందర్శించారు. ప్రతి స్టాల్‌కు వెళ్లి కొనుగోళ్ల వివరాలు, నగరవాసుల స్పందనను తెలుసుకోవడంతో పాటు ప్రదర్శనలో ఉంచిన ఉత్పత్తులను ఆసక్తిగా తిలకించారు. ఎస్‌హెచ్‌జీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా దేశవ్యాప్తంగా ఈ మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విశాఖ నగర ప్రజల నుంచి మేళాకు విశేష స్పందన రావడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్, మెప్మా ఎండీ తేజ్ భరత్‌తో కలిసి సే నో టూ ప్లాస్టిక్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ 25న ప్రారంభమైన మేళా ఇప్పటి వరకు రూ.27 లక్షల కొనుగోళ్లు సాధించిందన్నారు. ఈ నెల 29 వరకు మేళా విజయవంతంగా కొనసాగుతుందన్నారు. అనంతరం రాహుల్ కపూర్, మెప్మా ఎండీలను సత్కరించారు. జీవీఎంసీ యూసీడీ పీడీ సత్యవేణి తదితరులు పాల్గొన్నారు. శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నేచురల్ మిల్లెట్స్



బాబు ఎంపీఎస్ గ్రూపునకు చెందిన మహిళలు విక్రయిస్తున్న 9 రకాల చిరుధాన్యాలకు వినియోగదారుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. సహజ సిద్ధంగా పండించిన వీటిని సేకరించి మార్కెట్ చేస్తున్నారు. దీంతో పాటు సిద్ధ సన్నాలు, మైసూర్ మల్లిక, బ్రౌన్ రైస్, బ్లాక్ రైస్ తదితర రైస్ ఉత్పత్తులను వీరు విక్రయిస్తున్నారు. అరకేజీ మిల్లెట్ ప్యాకెట్లు రూ.60, కేజీ ప్యాకెట్లు రూ.120 కి విక్రయిస్తున్నారు.

వావ్.. చాక్లెట్ బొకేస్



సీతంపేట శ్రీ వంశీకృష్ణ గ్రూపునకు చెందిన మహిళలు తయారు చేసిన హోం మేడ్ చాక్లెట్ ఉత్పత్తులు వినియోగదారుల ప్రశంసలు అందుకుంటున్నాయి. హోం మేడ్ చాక్లెట్స్‌తో పాటు చాక్లెట్ బొకేలను ఈ గ్రూప్ సభ్యులు విక్రయిస్తున్నారు. ప్రత్యేక తయారీ సామగ్రిని దిగుమతి చేసుకుని గ్రూప్ మహిళలంతా కలిసి వీటిని తయారు చేస్తున్నట్లు వారు తెలిపారు. చాక్లెట్ బొకేలు రూ.1000 నుంచి రూ.1500 వరకు అందుబాటులో ఉన్నాయి.

మంగళగిరి.. న్యూలుక్



మంగళగిరి కాటన్స్ ఉత్పత్తిదారులు నేరుగా నిర్వహిస్తున్న స్టాల్‌లో పట్టు చీరలు, కలంకారీలో అనేక కొత్త ఉత్పత్తులను అందుబాటులో ఉంచారు. ఫ్యాన్సీ కలంకారీ శారీస్, టస్సర్ మెటీరియల్, నిజాం బోర్డర్, రుద్రాక్ష బోర్డర్ చీరలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. దీంతో పాటు అరటినారతో తయారు చేసిన చీరలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. రూ.1500 నుంచి రూ.3000 వేల వరకు చీరలు అందుబాటులో ఉన్నాయి.

నోరూరించే పచ్చళ్లు



భీమిలికి చెందిన, ఉషోదయ డ్వాక్రా గ్రూప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రుచికరమైన పచ్చళ్లు వినియోగదారులకు నోరూరిస్తున్నాయి. అపోలో ఫిష్, ప్రాన్స్, చికెన్, ఎగ్ పచ్చళ్లతో పాటు అన్ని రకాల వెజ్ పచ్చళ్లు అందుబాటులో ఉంచినట్లు నిర్వాహకులు తెలిపారు. 3 నెలల వరకు నిల్వ ఉండేలా వీటిని సిద్ధం చేసినట్లు చెప్పారు. అరకేజీ బాక్స్‌లలో అపోలో ఫిష్ పచ్చడి రూ.400, చికెన్ రూ.450, ప్రాన్స్ రూ.700లకు విక్రయిస్తున్నారు.

సహజ 'పరిమళం'



ఆఫీస్, కార్యాలయం, ఇల్లు.. ఆలా చోటు ఏదైనా పరిమళాన్ని వెదజల్లే ఫ్రాగ్రెన్స్‌ను శ్రీ సాయి కిరణ్ గ్రూప్ సభ్యులు విక్రయిస్తున్నారు. సహజసిద్ధంగా తయారు చేసిన ఈ ఫ్రాగ్రెన్స్ రకాలను పదుల సంఖ్యలో అందుబాటులో ఉంచారు. అగరబత్తీల నుంచి సాంబ్రాణీ, కార్ ఫ్రాగ్రెన్స్ వరకు అన్ని రకాల ఉత్పత్తులు వీరి వద్ద ఉన్నాయి. గోమయం, ఆవు పంచకంతో పాటు ప్రత్యేక వనమూలికలను సేకరించి వీటిని తయారు చేసినట్లు తెలిపారు. అగరబత్తీ, సాంబ్రాణి ప్యాకెట్లు రూ.50 కు విక్రయిస్తుండగా.. కార్ ఫ్రాగ్రెన్స్, రూమ్ ఫ్రాగ్రెన్స్ ధరలు రూ.80 నుంచి రూ.150 వరకు ఉన్నాయి.

కంబైన్డ్ హార్వెస్టర్‌తో గింజ రాలే సమస్యకు చెక్



వరి కోతను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

రాంబిల్లి(యలమంచిలి): కంబైన్డ్ హార్వెస్టర్‌తో వరి కోయడం ద్వారా గింజ రాలే సమస్యను అరికట్టవచ్చని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు అన్నారు. శుక్రవారం రాంబిల్లి మండలం రాజకోడూరు గ్రామంలో కంబైన్డ్ హార్వెస్టర్‌తో జరుగుతున్న వరి కోతలను, ఆరబెట్టిన ధాన్యాన్ని, వరి కుప్పలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి గింజ 80 శాతం పసుపు రంగులోకి మారిన వెంటనే కంబైన్డ్ హార్వెస్టర్‌తో వరి కోయడం ద్వారా గింజలు నేలపై రాలకుండా ఉంటాయన్నారు. కూలీలకు అయ్యే ఖర్చు, నూర్పులకు అయ్యే వ్యయం తగ్గడమే కాకుండా సమయం ఆదా అవుతుందని తెలిపారు. వరి కుప్పలు వేసేటప్పుడు మధ్యలో 50 కిలోల కళ్లు ఉప్పు, ఊక వెయ్యడం ద్వారా గింజ రంగు మారకుండా ఉంటుందని రైతులకు సూచించారు. అలాగే పీఎం కిసాన్ లబ్ధిదారుల వెరిఫికేషన్ ప్రక్రియ ఈకేవైసీ, రైతుల అకౌంట్లను ఎన్‌పీసీఐ లింక్ చేయించాలని బ్యాంకు వారిని సంప్రదించి ఇప్పటి వరకు పంట రుణాలు తీసుకోని రైతులకు అందేలా చూడాలని వ్యవసాయ సహాయకులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సుమంత, వ్యసాయ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో పోలీస్ గ్రీవెన్స్



మహిళా కానిస్టేబుల్ సమస్యను వింటున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం పోలీస్ గ్రీవెన్స్ డే జరిగింది. జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది తమ సమస్యలను ఎస్పీ తుహిన్ సిన్హాకు లిఖితపూర్వకంగా తెలియజేశారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ గ్రీవెన్స్ డే సందర్భంగా వృత్తిపరమైన, వ్యక్తిగత సమస్యలపై అర్జీలు వచ్చాయని, సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో



పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో బాలజీ

పాయకరావుపేట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.ఎస్.బాలాజీ తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో సిబ్బంది హాజరును పరిశీలించారు. ఓపీ, ఫార్మసీ, టీబీ రిజిస్టర్, డెలివరి వార్డు, ఆయుష్ విభాగాలను తనిఖీ చేశారు. కొత్తగా నిర్మిస్తున్న అదనపు భవన నిర్మాణాన్ని పరిశీలించారు. వైద్యాధికారులు డాక్టర్ సుభాష్, డాక్టర్ పద్మావతిలకు తగు సూచనలు చేశారు. వైద్య సిబ్బంది పి.వి. రమణ, ఎంపీహెచ్‌వో రమణ, ఫార్మాసిస్ట్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని యువకుడు మృతి



మృతి చెందిన రాజేష్

గొలుగొండ: ఆగి ఉన్న ట్రాక్టర్‌ను బైక్ ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందారు. నర్సీపట్నం నుండి బైక్‌పై వస్తున్న ముగ్గురు యువకులు సొంత గ్రామం పాత కృష్ణదేవిపేట గ్రామం వెళ్తున్న సమయంలో గొలుగొండ పోలీస్‌స్టేషన్ సమీపంలో రాత్రి 7 గంటల సమయంలో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్నారు. దీంతో పాతకృష్ణదేవిపేట గ్రామానికి చెందిన పి. రాజేష్ అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక ఉన్న ప్రకాష్, శివకు చిన్నపాటి గాయాలయ్యాయి. వారిని స్థానికులు నర్సీపట్నం తరలించారు. సమాచారం అందడంతో గొలుగొండ ఎస్‌ఐ రామారావు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

108 వాహనంలో సుఖ ప్రసవం

తల్లీ బిడ్డా క్షేమం



జన్మించిన బిడ్డతో 108 సిబ్బంది

దేవరాపల్లి: చింతలపూడి పంచాయతీ బల్లిపురం గిరిజన గ్రామానికి చెందిన గెమ్మెల రామలక్ష్మి (26) శుక్రవారం 108 వాహనంలో ప్రసవించింది. వేకువజాము 3.30 గంటలకు ఆమెకు పురిటి నొప్పులు రావడంతో స్థానిక ఆశా కార్యకర్త జి.లక్ష్మి 108 వాహనానికి సమాచారం అందించారు. 108 సిబ్బంది గర్భిణిని వాహనంలోకి ఎక్కించుకొని దేవరాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్తుండగా ఒక్కసారిగా పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. వెంటనే అప్రమత్తమైన 108 వాహనంలోని ఈఎంటీ పొటెళ్ల దేముళ్లు, పైలట్ బీఎస్ నాయుడు సమయస్ఫూర్తితో వ్యవహరించి ప్రసవం చేశారు. రామలక్ష్మి మార్గంమధ్యలోనే తొలి కాన్పులో పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. వెంటనే దేవరాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారు. ప్రసవం చేసిన 108 సిబ్బందిని, ఆశా కార్యకర్త లక్ష్మిని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ఇ.పూజ్య మేఘన అభినందించారు.

అప్పన్న అన్నప్రసాదానికి రూ.2 లక్షల విరాళం



ఏఈవోకు చెక్కు అందిస్తున్న దాత కృష్ణమూర్తి పాత్రుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి సింహాచలం దేవస్థానం మాజీ ట్రస్ట్‌బోర్డు సభ్యుడు, నగరంలోని మధురవాడకు చెందిన పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు 2 లక్షల 116 రూపాయల విరాళాన్ని శుక్రవారం అందించారు. సింహగిరికి వచ్చిన దాత సంబంధిత విరాళాన్ని చెక్కు రూపంలో ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్‌కు ఇచ్చారు. దేవస్థానం తరఫున దాతకు స్వామివారి దర్శనం కల్పించి శేషవస్త్రం, ప్రసాదాన్ని అధికారులు అందించారు. ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు, ఉద్యోగి నాయుడు పాల్గొన్నారు.

మన్మోహన్‌కు ఘన నివాళి



మునగపాకలో నివాళులర్పిస్తున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్



మాడుగులలో మాజీ ప్రధాని మన్మోహన్‌కు నివాళులర్పిస్తున్న బూడి ముత్యాలనాయుడు

మాడుగుల: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ గొప్ప రాజనీతిజ్ఞుడని, ఆయన మృతి బాధాకరమని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు అన్నారు. మాడుగులలో శుక్రవారం ఏర్పాటు చేసిన సంతాప సభలో మన్మోహన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, మాజీ ఎంపీపీ వేమవరపు రామధర్మజ, పార్టీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు సర్పంచ్ ఎడ్ల కళావతి, ఎంపీటీసీలు పొలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరి, కోఆప్షన్ మెంబరు షేక్ ఉన్నీషా పాల్గొన్నారు.

మునగపాకలో..

మునగపాక: దేశ చరిత్రలో మన్మోహన్‌సింగ్ పాలన సువర్ణ అధ్యాయంగా నిలుస్తుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ అన్నారు. దేశంలో పలు సంస్కరణలు అమలు చేసి నీతివంతమైన పాలన అందించారన్నారు. మునగపాకలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. ఎన్నో సంస్కరణలు ప్రవేశపెట్టి బడుగు, బలహీన వర్గాల ప్రజలకు మేలు చేశారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు దిమ్మల అప్పారావు, బొడ్డేడ శ్రీనివాసరావు, భీశెట్టి గంగప్పలనాయుడు, పెదబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి నడయాడిన ప్రాంతాల అభివృద్ధి



ఏఎల్‌పురంలో ఉన్న అల్లూరి కాంస్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

గొలుగొండ: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు నడయాడిన ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని కేంద్ర ట్రైబల్ కల్చర్ సంయుక్త కార్యదర్శి నందూరి ఉమ తెలిపారు. ఆమె శుక్రవారం ఏఎల్ పురంలో ఉన్న అల్లూరి సమాధుల వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన్యం వీరుడు అల్లూరి దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటాలు నిర్వహించి ప్రాణాలు అర్పించారన్నారు. ఆయన ఎక్కడెక్కడ పోరాటాలు నిర్వహించారో గుర్తించి ఆయా ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మంప, రాజేంద్రపాలెం, కృష్ణదేవిపేట ప్రాంతాల అభివృద్ధి కోసం ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణ రాజు, అల్లూరి సీతారామరాజు సంఘం తెలుగు రెండు రాష్ట్రాల అధ్యక్ష, కార్యదర్శులు నడింపల్లి నానిబాబు, పి.రఘుతోపాటు రాధాకృష్ణరాజు, దంతులూరి సుబ్రమణ్యరాజు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అనకాపల్లి: మండలంలో సీహెచ్ఎన్ అగ్రహారం జాతీయ రహదారిలో ద్విచక్ర వాహన చోదకుడికి కుక్క అడ్డు రావడంతో రహదారిపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు శ్రీకాకుళం గ్రామానికి చెందిన ముద్దాడ రాజేంద్ర (36) కుటుంబ సమేతంగా శ్రీకాకుళం నుంచి వేపగుంట వచ్చాడు. అక్కడి నుంచి మునగపాక మండలం ఒంపోలు గ్రామానికి వెళ్తున్న సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజేంద్ర మృతి చెందగా భార్య, ఇద్దరు పిల్లలు విశాఖ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయమై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ రవికుమార్ చెప్పారు.

సమస్యల పరిష్కారం కోరుతూ కార్మికుల ధర్నా



గోవాడ షుగర్ ఫ్యాక్టరీ వద్ద ధర్నా చేస్తున్న గుర్తింపు సంఘం కార్మికులు

చోడవరం: కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, అంత వరకూ విధుల్లోకి వెళ్లమంటూ గుర్తింపు కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికులంతా గోవాడ సుగర్ ఫ్యాక్టరీ గేటు ముందు ధర్నా చేశారు. ఫ్యాక్టరీ ఆవరణలో శుక్రవారం విధి నిర్వహణలో ఉన్న కార్మికులంతా విధులను నిలిపివేసి గేటు బయటకు వచ్చి సెక్యూరిటీ గేటు వద్ద బైఠాయించి ధర్నా చేశారు. కార్మికుల రావలసిన జీతభత్యాలు నేటి వరకూ చెల్లించలేదని, రెండేళ్లుగా కార్మికులకు ఇవ్వాల్సిన ఓటీ డబ్బు ఇవ్వలేదని, గత ఏడాది నుంచి డీఏలు ఇవ్వలేదని, ఇవన్నీ వెంటనే చెల్లించాలని కార్మిక సంఘం అధ్యక్షుడు కె.వి.వి. భాస్కరరావు డిమాండ్ చేశారు. ఈ ఆందోళన కారణంగా ఓవరాయిలింగ్ పనులకు కొంత మేర ఇబ్బంది ఏర్పడింది. మరో వారం రోజుల్లో రెగ్యులర్ క్రషింగ్‌కు సిద్ధమవుతున్న సమయంలో కార్మికులు ఆందోళనకు దిగడంతో సమస్య పరిష్కరించే దిశగా యాజమాన్యం చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పటిష్ట నిఘాతోనే గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట



కొత్తకోట పోలీసు సర్కిల్ కార్యాలయంలో పట్టుబడిన వాహనాలను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రావణి

చోడవరం: గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు మరిన్ని చర్యలు తీసుకోవాలని అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి ఆదేశించారు. రావికమతం మండలం కొత్తకోట పోలీసు సర్కిల్ స్టేషన్‌ను, రావికమతం, కొత్తకోట పోలీసు స్టేషన్లను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ కేసుల్లో పట్టుబడిన గంజాయి, వాహనాలను ఆమె పరిశీలించారు. పాత కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ రికార్డులను తనిఖీ చేసి, నేరాల అదుపునకు తీసుకోవాల్సిన చర్యలపై సీఐ కోటేశ్వరరావుకు ఆదేశించారు. ప్రధానంగా గంజాయి అక్రమ రవాణాపై దృష్టి పెట్టాలని, నిఘాను విస్తృతం చేయాలని ఆదేశించారు. ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. మాదక ద్రవ్యాల నిర్మూలనకు విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆమె ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు విధిగా హెల్మెట్ ధరించేలా వాహన చోదకులకు అవగాహన కల్పించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు గ్రామాల్లో జరగకుండా ఎప్పటికప్పుడు గస్తీ నిర్వహించాలన్నారు. స్థానికుల సహకారంతో అన్ని ప్రధాన జంక్షన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పెట్రోలింగ్ నిర్వహణలో ఎక్కడా అలసత్వం ప్రదర్శించవద్దన్నారు. ఎస్‌ఐలు శ్రీనివాస్, రఘువర్మ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో అమృతరావుకు చోటు



అమృతరావు

కె.కోటపాడు : ఎ.కోడూరు హైస్కూల్‌కు చెందిన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు జె.అమృతరావు జాతీయ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు. అమృతరావు ప్రకృతిపై రాసిన కవితతో పాటు సాహిత్య మక్కువను గుర్తించి విజయవాడకు చెందిన జాతీయ తెలుగు కళారత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఆయన పేరు నమోదు చేసినట్లు సంస్థ జాతీయ చైర్మన్ యు.వి.రత్నం తెలిపారు. ఈ నేపథ్యంలో అమృతరావుకు ఈ నెల 22న విజయవాడలో ఠాగూర్ గ్రంథాలయంలో అవార్డుతో పాటు ప్రసంసాపత్రం అందించారు. కార్యక్రమంలో అవార్డు కమిటీ చైర్మన్ ఉషారాణి పాల్గొన్నారని అమృతరావు తెలిపారు.

క్లుప్తంగా

సంతోషిమాతకు ప్రత్యేక పూజలు



సంతోషిమాత అమ్మవారి సన్నిధిలో ఏకాహం నిర్వహిస్తున్న మహిళలు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం సంతోషిమాత అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు రెండో రోజు శుక్రవారం కూడా ఘనంగా జరిగాయి. తెల్లవారు జాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ అమ్మవారి ఆలయంలో జై సంతోషిమాత అంటూ ఏకాహం నిర్వహించారు. సంతోషిమాత, సత్య వినాయక సేవా, గీతా మహిళా, సత్తెమ్మతల్లి మహిళా సంఘాల మహిళలు అమ్మవారి ఏకాహం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మారిశెట్టి భాస్కరరావు, ఈవో టి.రాజా సులోచన, ఆలయ అర్చకుడు సరిపల్లి కామేశ్వరరావు పాల్గొన్నారు.

80 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ



టెన్త్, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేస్తున్న సరిపల్లి రాజేష్

అనకాపల్లి: విద్యతోనే మానవుని జీవనశైలిలో మార్పులు వస్తాయని, విద్యార్థి దశ నుంచి కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని రోటరీ క్లబ్ పట్టణ శాఖ అధ్యక్షుడు సరిపల్లి రాజేష్ తెలిపారు. స్థానిక న్యూకాలనీ రోటరీ హాల్లో పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన 80 మంది విద్యార్థులకు రూ.లక్ష నగదును స్కాలర్‌షిప్‌ల రూపంలో శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి దేవత అనిల్, చైర్మన్ బి.ఎస్.గుప్తా, క్లబ్ సీనియర్ నాయకులు కడిమిశెట్టి సతీష్, బుద్ద రమణాజీ, కొణతాల రామానాయుడు, కె.వి.గౌరీపతి, కె.ఎల్.ఎస్.కుమార్ పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 922 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,000	5,180
మొదటి రకం	3,810	4.300
రెండో రకం	3,390	3,880
మూడోరకం	3,230	3,440

అనకాపల్లి సినిమాలు

పుష్ప-2	సత్యనారాయణ స్క్రీన్-1
ముఫాసా	సత్యనారాయణ స్క్రీన్-2
యూఐ	పర్తిసాయి
మ్యాక్స్	షిర్డీసాయి
శ్రీకాకుళం షెర్లాక్ హోమ్	వెంకటేశ్వర
అమరన్	శ్రీసత్య
డ్రింకర్ సాయి	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 37 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, బీ పాజిటివ్-13 యూనిట్లు, ఓ పాజిటివ్-19 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ య.లోకేష్‌ను 9703619706 ఫోన్ నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 364 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 311 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబరులో సంప్రదించవచ్చు.

విద్యుత్ చార్జీల పెంపుపై జనాగ్రహం



విద్యుత్ శాఖ కార్యాలయానికి బైక్ ర్యాలీగా వెళ్తున్న వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి భరత్‌కుమార్, నాయకులు, ప్రజలు



విద్యుత్ శాఖ కార్యాలయంలో ఏఏవో పద్మావతికి వినతిపత్రం అందజేస్తున్న భరత్‌కుమార్, దిలీప్‌కుమార్, జానకీరామరాజు, పార్టీ శ్రేణులు

- అనకాపల్లిలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆందోళన
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు
- పెంచిన విద్యుత్ చార్జీలు తక్షణమే తగ్గించాలి
- పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భరత్‌కుమార్

అనకాపల్లి: విద్యుత్ చార్జీల పెంపుపై జనాగ్రహం పెల్లుబికింది. శుక్రవారం వైఎస్సార్‌సీపీ చేపట్టిన పోరుబాటలో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజానీకం నినదించింది. ఎడాపెడా చార్జీలు పెంచి తమ నడ్డి విరచొద్దంటూ ఏకరువు పెట్టింది. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు స్థానిక రింగ్‌రోడ్డులోని పార్టీ కార్యాలయం నుంచి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు నల్లబ్యాడ్జిలు ధరించి, పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలంటూ నినాదాలు చేస్తూ గవరపాలెం విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయం వరకూ శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీ రింగ్‌రోడ్డు, భీముని గుమ్మం, రామచంద్ర థియేటర్, నెహ్రూచౌక్, వేల్పులవీధి జంక్షన్, పెరుగుబజార్ జంక్షన్, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మీదుగా గవరపాలెం నిదానందొడ్డిలో విద్యుత్‌శాఖ ఎస్ఈ కార్యాలయం వరకూ సాగింది. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలను మోసాలు చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తన 40 ఏళ్ల రాజకీయ చరిత్రలో ఆరితేరిపోయారన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పి, అధికారం చేపట్టిన ఆరుమాసాల్లో బడుగు, బలహీన వర్గాల ప్రజలపై రూ.15,485 కోట్ల విద్యుత్ చార్జీల పెంచడం దారుణమన్నారు. ఆరు మాసాల్లో కూటమి ప్రభుత్వంపై ప్రజలు విరక్తి చెందారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల హామీలను అమలు చేయకుండా ప్రజలపై భారం ఎలా మోపాలనే దానిపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి పెట్టారని చెప్పారు. వినియోగదారులతో విద్యుత్‌ను అమ్మే విధంగా చర్యలు తీసుకుంటామని, సంపద సృష్టిస్తామని, సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని బూటకపు హామీలతో గద్దెనెక్కి ఇప్పుడు ప్రజల నడ్డివిరిస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. ప్రజల జీవితాల్లో గుర్తుండిపోయే విధంగా నవంబర్, డిసెంబర్ మాసాల్లో రూ.15,485 కోట్ల భారం మోపారన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో స్మార్ట్ మీటర్లు బిగించడానికి వచ్చిన విద్యుత్ శాఖ సిబ్బందిపై దాడులు చేసి, మీటర్లను పగలగొట్టండని చెప్పిన పిలుపునిచ్చిన చంద్రబాబు.. ఇప్పుడు ముందుగా వ్యాపారస్తులకు స్మార్ట్ మీటర్లు బిగించడం ప్రజలను మోసం చేయడం కాదా అని ఆయన ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పటికీ ప్రజల పక్షాన నిలబడి అండగా ఉంటారని భరత్ కుమార్ తెలిపారు. రానున్న రోజుల్లో ఇలాగే పరిపాలన సాగిస్తే ప్రజలు కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టండన్న నారా లోకేష్ ఇచ్చిన పిలుపు ప్రజలు మర్చిలేదన్నారు.



అంతకు ముందు రామచంద్ర థియేటర్ వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి మలసాల భరత్‌కుమార్, దిలీప్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే పెరుగుబజార్ జంక్షన్ వద్ద దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పార్టీ శ్రేణులు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం విద్యుత్ శాఖ కార్యాలయంలో అసిస్టెంట్ అకౌంట్ అధికారి కె.పద్మావతికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి జోషఫ్, జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, ఎంపీపీలు గొర్లి సూరిబాబు, కలగా లక్ష్మి గున్నయ్యనాయుడు, పార్టీ అనకాపల్లి, కశింకోట మండలాల అధ్యక్షులు పెదిశెట్టి గోవింద్, మలసాల కిషోర్, 80, 84 వార్డు ఇన్‌చార్జ్‌లు కె.ఎం.నాయుడు, కోరుకొండ రాఘవ, జెడ్పీటీసీ శ్రీధర్‌రాజు, మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు ఎ.వి.రత్నకుమారి, యువజన విభాగం పట్టణ అధ్యక్షులు ఉగ్గిన అప్పారావు, వేగి త్రినాథ్, పార్టీ సీనియర్ నాయకులు కుండల రామకృష్ణ, దాడి నారాయణరావు, తాతయ్యలు, కాండ్రేగుల శ్యామ్, సీటిపల్లి లక్ష్మి, మరిపల్లి శోభ, పంచదార్ల కన్నారావు, గైపూర్ రాజు, అధిక సంఖ్యలో ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, వివిధ దేవాలయాల మాజీ చైర్మన్లు, డైరెక్టర్లు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.



పార్టీ కార్యాలయం నుంచి రైల్వే స్టేషన్ వరకూ పాదయాత్ర చేస్తున్న భరత్‌కుమార్, దిలీప్‌కుమార్, జానకీరామరాజు, జి.సూరిబాబు, పార్టీ శ్రేణులు, ప్రజలు

పారిశుధ్య కార్మికులకు బకాయిలు చెల్లించాలి



జోనల్ కమిషనర్ బి.వి.రమణకు వినతిపత్రం అందిస్తున్న గంటా శ్రీరామ్

అనకాపల్లి: జీవీఎంసీ జోనల్ పరిధిలో కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికుల బకాయి జీతాలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని మున్సిపల్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) గౌరవాధ్యక్షుడు గంటా శ్రీరామ్ డిమాండ్ చేశారు. స్థానిక జోనల్ కార్యాలయంలో శుక్రవారం యూనియన్ ఆధ్వర్యంలో జోనల్ కమిషనర్ బి.వి.రమణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ వర్కర్స్‌గా అదనంగా నియమించిన 15 మంది కార్మికులకు 8 నెలలగా జీతాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. 28 మంది పారిశుధ్య వాహనాల సిబ్బందికి కూడా నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదన్నారు. ఈ నెలాఖరుతో కాంట్రాక్టు ముగుస్తుందని, కాంట్రాక్ట్ ముగిసే ముందు కార్మికుల జీతాలు తక్షణమే చెల్లించాలని ఆయన కోరారు. మలేరియా విభాగంలో తొలగించిన నలుగురు కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, లేని పక్షంలో మొత్తం కార్మికులు విధులను బహిష్కరిస్తారని ఆయన హెచ్చరించారు. జోనల్ కార్యాలయంలో కొంత మంది అధికారులు పర్మినెంట్ కార్మికులకు రావలసిన నగదుకు బిల్లులు పెట్టకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ కార్యదర్శి యర్రంశెట్టి శివకుమార్, క్లాప్ వెహికల్స్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు జలగడుగుల శివకుమార్, నీలాపు లోకేష్, సింగంపల్లి నాగమణి, బంగారు సాయి, బొమ్మల పాలరావు, బండి చంటి, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



డీఈవో అప్పారావునాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న తుంపాల వెంకటరమణ

అనకాపల్లి: జిల్లా వ్యాప్తంగా కేజీబీవీల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తుంపాల వెంకటరమణ, నక్కా శ్రీనివాస్‌బాబు కోరారు. ఈ మేరకు కొప్పాక డీఈవో కార్యాలయంలో డీఈవో గిడ్డి అప్పారావునాయుడుకు వారు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు క్యాజువల్ సెలవులు మూడు మాత్రమే తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం అన్యాయమన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు సెలవులు మంజూరు చేయాలని, కేజీబీవీ ఉపాధ్యాయులకు వేతనంతో కూడిన మెడికల్ లీవులు ఇవ్వాలని, పదో తరగతి వంద రోజులు ప్రణాళికలో సెలవు దినాలను మినహాయింపు ఇవ్వాలని కోరారు.

సమన్వయం కోసమే ‘విద్యార్థి మేలుకో’



వెదురుపర్తిలోని విద్యార్థుల ఇళ్ల వద్ద ప్రగతి పత్రాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

కశింకోట: విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయం చేసుకోవడానికి ‘విద్యార్థి మేలుకో’కార్యక్రమం దోహదపడుతుందని వెదురుపర్తి హైస్కూల్ గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు ఎ.వి.ఎస్.మూర్తి తెలిపారు. మండలంలోని వెదురుపర్తిలో విద్యార్థి మేలుకో కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గణిత ఉపాధ్యాయుడు మూర్తి, ఆంగ్ల ఉపాధ్యాయుడు బోయిన చిన్నారావు వేకువ జామున టెన్త్ చదువుతున్న విద్యార్థుల ఇంటింటికి వెళ్లి ప్రగతి పత్రాలు అందజేశారు. విద్యార్థులకు తమ పాఠ్యాంశాల్లో అనుమానాలను నివృత్తి చేసి వారి వికాసాభివృద్ధికి సలహాలు, సూచనలు ఇచ్చారు. విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. సంగ్రహణాత్మక మూల్యాంకణం పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులుగా బ్యాగులు అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థి మేలుకో కార్యక్రమానికి సత్ఫలితాలు వస్తున్నాయని, వారానికి రెండు రోజుల పాటు విద్యార్థులను చైతన్య పరిచి టెన్త్ పబ్లిక్ పరీక్షలకు సిద్ధం చేసి ఉత్తమ ఫలితాలు సాధించే లక్ష్యంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. వచ్చే మార్చి వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

కాలు పోగొట్టుకున్న లారీ డ్రైవర్‌కు సాయం



ఆనందపురంలో లారీ డ్రైవర్ బాబూరావుకు సాయం అందిస్తున్న లైఫ్ ఆఫ్ గివింగ్ సేవా సంస్థ ప్రతినిధులు

కశింకోట: రోడ్డు ప్రమాదంలో కాలు పోగొట్టుకున్న ఓ లారీ డ్రైవర్‌కు లైఫ్ ఆఫ్ గివింగ్ సేవా సంస్థ శుక్రవారం ఆర్థిక సహాయాన్ని అందించి ఆసరాగా నిలిచింది. మండలంలోని సుందరయ్యపేట శివారు ఆనందపురం గ్రామానికి చెందిన గొల్ల బాబూరావు లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గత 20 రోజుల క్రితం యలమంచిలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదానికి గురై కుడి కాలు పోగొట్టుకున్నాడు. ప్రస్తుతం ఇంటి వద్ద మంచానికి పరిమితమయ్యాడు. ఈయనకు ఇద్దరు పిల్లలున్నారు. తమతో సరదాగా గడిపిన బాబూరావు సంపాదన లేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న స్థానిక లైఫ్ ఆఫ్ గివింగ్ సేవా సంస్థ సభ్యులు చుట్టు పక్కల గ్రామ ప్రజల సహకారంతో రూ.13,200 సేకరించారు. ఆ మొత్తాన్ని బాబూరావు కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు చుక్క ఆనంద్, కూండ్రపు ఈశ్వరరావు, కన్నూరు లక్ష్మణ్, కన్నూరు మహేష్, బండారు శివ, అనిల్‌కుమార్, చిరంజీవి, బండారు అప్పలనాయుడు, గొర్లి సాయికుమార్, నాయుడు, కూండ్రపు ప్రదీప్ పాల్గొన్నారు.

వ్యవసాయానికి నేడూ విద్యుత్ సరఫరా నిలిపివేత

అనకాపల్లి: విద్యుత్ శాఖ డీ-2 సెక్షన్ పరిధిలో జాతీయ రహదారి కొప్పాక 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో జంగిల్ క్లియరెన్స్ నిమిత్తం వ్యవసాయ మోటార్లకు శనివారం కూడా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆ శాఖ ఈఈ కె.రాజశేఖర్, డీ-2 ఏఈ జి.వై.రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ ఉండదని, రైతులు సహకరించాలని కోరారు.

గవర కార్తీక వన సమారాధన రేపు



గవర కార్తీక వన సమారాధన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం మహిళా ప్రతినిధులు

తుమ్మపాల: గవర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో రింగ్‌రోడ్‌లోని ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డులో ఆదివారం నిర్వహించే గవర కార్తీకమాస వన సమారాధనను విజయవంతం చేయాలని సంఘం అధ్యక్షురాలు పొలమరశెట్టి వాణి కోరారు. ఈ మేరకు ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో జరిగే ఏర్పాట్లను సంఘ మహిళ విభాగం ప్రతినిధులు శుక్రవారం పరిశీలించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లాలో అన్ని ప్రాంతాల నుంచి గవర కులస్తులంతా పెద్ద ఎత్తున హాజరు కానున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పోలమరశెట్టి వాణి, కాండ్రేగుల అరుణ రాణి, దొడ్డి పార్వతి దేవి, మల్ల గౌరీ, కాండ్రేగుల కనకమహాలక్ష్మి, కాండ్రేగుల యమున, పెంటకోట భవాని, పొలమర శెట్టి జ్యోతి, యల్లపు లత పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో భూసమస్యల పరిష్కారం



జగన్నాథపురంలో అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో సత్యనారాయణరావు

తుమ్మపాల: భూసమస్యలు పరిష్కరించేందుకు గ్రామాల్లోనే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు డీఆర్వో సత్యారాయణరావు తెలిపారు. మండలంలో జగన్నాథపురం గ్రామంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని అధికారులకు ఆయన సూచించారు. సమస్య పరిష్కారానికి గల గడువును అర్జీదారుడికి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ శ్రీరామమూర్తి, సర్పంచ్ ముర్వ్వల రాము, ఆర్ఐ రమేష్, మండల సర్వేయర్ మోహన్ పాల్గొన్నారు.

రెండో రోజూ ముఠా కార్మికుల సమ్మె



గాంధీ కూరగాయలు మార్కెట్ వద్ద కార్మికులతో మాట్లాడుతున్న గనిశెట్టి సత్యనారాయణ

అనకాపల్లి: పట్టణ పరిధిలో కూలిరేట్లు పెంచాలని కోరుతూ రెండో రోజు శుక్రవారం కూడా ముఠా కార్మికులు సమ్మె చేశారు. స్థానిక కూరగాయలు మార్కెట్ వద్ద జరిగిన ఆందోళన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా ముఠా కార్మికుల కూలి రెట్లు పెంచాలని డిమాండ్ చేశారు. చాలీచాలని ఆదాయంతో కార్మికుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయన్నారు. కార్మికులకు సరైన పనులు లేక అనేక మంది హమాలీ పనులు వదులుకుని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. దుకాణా యాజమానులు కూడా బంద్ నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కూలిరేట్లు పెంచేలా అధికారులు దుకాణ యాజమానులతో చర్చలు జరపాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పలకా సత్యనారాయణ, పి.పరమేశ్వరరావు, ముఠా వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కాపుశెట్టి అప్పారావు, జి.నర్సింగరావు, సభ్యులు తిర్రి సురేష్, భీశెట్టి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



జిల్లా వ్యవసాయ శాఖ ఏడీ వసంతకుమారికి వినతిపత్రం అందిస్తున్న కర్రి అప్పారావు

అనకాపల్లి: తుపాను కారణంగా జిల్లాలో అచ్యుతాపురం, రాంబిల్లి, పోడవరం, నక్కపల్లి, ఎస్.రాయవరం, తదితర మండలాల్లో వరిపంటకు నష్టం తీవ్రంగా జరిగిందని, అన్నంపెట్టే రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏడీ వసంతకుమారికి శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండిపోయి చేతికి అందివచ్చిన వరి చేను తడిసిపోయిందన్నారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేలు నష్టపరిహారం ఇవ్వాలని, తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వమే రైతు సహాయ కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని కోరారు. క్వింటా ధాన్యానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.2,320లకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.500లు ఇవ్వాలని, కూటమి ప్రభుత్వం ప్రకటించిన రైతు పెట్టుబడి రూ.20వేలు తక్షణం అందజేయాలని, తదితర డిమాండ్లతో కూడిన వినతి ప్రతం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి జి.నాయనబాబు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న, కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె.సదాశివరావు, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.వి.నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు నివాళి



మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మలసాల భరత్‌కుమార్




మౌనం పాటిస్తున్న న్యాయవాదులు

అనకాపల్లి: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరనిలోటని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డులోని పార్టీ కార్యాలయంలో మన్మోహన్‌సింగ్ చిత్ర పటానికి ఆయన శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్మోహన్‌సింగ్ అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సఖ్యతగా ఉంటూ దేశాభివృద్ధికి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, అనకాపల్లి, కశింకోట మండలాల అధ్యక్షులు పెదిశెట్టి గోవింద్, మలసాల కిషోర్, ఎంపీపీ గొర్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

తుమ్మపాల: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.జె.వి.ఎస్.కుమార్ అన్నారు. మన్మోహన్ సింగ్ మృతికి నివాళులర్పిస్తూ పట్టణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయవాదులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి దశ దిశ మార్చిన ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్ అని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ దుర్గారావు, ఉపాధ్యక్షురాలు రోజా, సీనియర్ న్యాయవాదులు రమణయ్య, స్వామి, గోవింద్, రాజశేఖర్, గంగాధర్ పాల్గొన్నారు.

కరుణించిన వరుణుడు



పొలాల్లో వరి చేను పనుల్లో నిమగ్నమైన రైతులు

కశింకోట: కొద్ది రోజులుగా కలవరపాటుకు గురి చేసిన వరుణుడు ప్రస్తుతం శాంతించాడు. దీంతో మండలంలోని రైతులు వరి చేలు పనుల్లో శుక్రవారం నిమగ్నమయ్యారు. ఈ నెలలో వరుస తుపానుల కారణంగా అధికారుల హెచ్చరికలతో వరి కోతలకు, కోసిన పనల సేకరణకు ఆటంకం ఏర్పడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వాతావరణం తెరిపివ్వడం, శుక్రవారం ఎండ కాయడంతో రైతులు వరి కోతలకు సన్నద్ధమయ్యారు. సుమారు 1,360 హెక్టార్లలో వరి పంట వేయగా, పది శాతం మాత్రమే కోతలు అయ్యాయి. ఇంకా 90 శాతం కోత కోయాల్సి ఉంది. ఈ తరుణంలో తుపాను, అల్ప పీడనం వల్ల పనులు నిలిచిపోయాయి. కొన్ని చోట్ల వర్షాలు, గాలులకు వరి నేలకొరిగింది. మరికొన్ని చోట్ల కోసిన వరి పనలు మడుల్లో ఉండిపోయాయి. ఈ నేపథ్యంలో వాతావరణం తెరిపివ్వడంతో పంట సేకరణలో రైతులు సన్నద్ధమయ్యారు.

12 మద్యం బాటిళ్ల స్వాధీనం

అనకాపల్లి: జీవీఎంసీ విలీన గ్రామమైన గొర్రెలవానిపాలెం-వల్లూరు రహదారిలో అజ్ఞాత వ్యక్తులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు శుక్రవారం తనిఖీలు చేశారు. గొర్రెలవానిపాలెం గ్రామానికి చెందిన గొర్లి వెంకటలక్ష్మి అనధికారికంగా తరలిస్తున్న 12 మద్యం బ్యాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ వైఎస్ నాయుడు తెలిపారు. ఈ మేరకు వెంకటలక్ష్మిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

నేడు గౌరీపరమేశ్వరుల ఉత్సవం



అనకాపల్లి: స్థానిక మెయిన్ రోడ్డులో కుంచావారి గౌరీపరమేశ్వరుల మహోత్సవం శనివారం నిర్వహించనున్నట్టు ఆలయ చైర్మన్ ఎం.వీరభద్రరావు తెలిపారు. తెల్లవారుజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తామని, భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని చెప్పారు. మధ్యాహ్నం సాంస్కృతిక కార్యక్రమాల నడుమ అమ్మవారిని పట్టణంలో ఊరేగిస్తామని పేర్కొన్నారు. మహోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ లైటింగ్ ఆకట్టుకుంటుంది.